సాక్షి
అనంతపురం

సోమవారం । 16 । డిసెంబర్ । 2024



టమాట కిలో రూ.10

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



అమ్మో 'ఏ-1' సీటా

కలెక్టరేట్‌లో కీలకమైన 'ఏ-1' సీట్‌లో విధులు నిర్వర్తించేందుకు అధికారులు వణుకుతున్నారు. బాధ్యతలు చేపట్టేందుకు జంకుతున్నారు.

8లో

గరిష్ఠం/కనిష్ఠం
31.8°/12.4°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

గజగజ



ఉదయం 8 గంటలైనా జాతీయ రహదారిపై లైట్ల వెలుగులో వెళ్తున్న వాహనాలు

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో చలితీవ్రత పెరిగింది. జనం గజగజ వణుకుతున్నారు. అనంతపురంతో పోల్చితే శ్రీ సత్యసాయి జిల్లాలో చలి తీవ్రత కాస్త అధికంగా ఉంది. ఆదివారం ఉదయం మడకశిరలో 11.4 డిగ్రీలు, బెళుగుప్పలో 12.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. అలాగే, రొద్దం 12.4, సోమందేపల్లి 12.7, గుమ్మఘట్ట, అగళిలో 13 డిగ్రీలు, పరిగి 13.1, నల్లమాడ 13.2, శెట్టూరు, చిలమత్తూరులో 13.4, ఓడీ చెరువు 13.6, కంబదూరు, రాయదుర్గం 13.7, రాప్తాడు 14.2, వజ్రకరూరు 14.3, ఉరవకొండ, బొమ్మనహాళ్ 14.7 డిగ్రీలు, కణేకల్లులో 14.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా మండలాల్లో 14 నుంచి 17 డిగ్రీల మధ్య కొనసాగాయి. ప్రధానంగా మడకశిర, హిందూపురం, కదిరి, కళ్యాణదుర్గం, ఉరవకొండ డివిజన్లలో ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. ఇక గరిష్ట ఉష్ణోగ్రతలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 27 నుంచి 32 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నా ఎండతీవ్రత పెద్దగా లేదు. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు పొగమంచుతో వెలుతురు తగ్గిపోతోంది. సంక్రాంతి వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షునిగా దివాకర్



అధ్యక్ష, కార్యదర్శులకు డిక్లరేషన్ అందజేస్తున్న ఎన్నికల అధికారి

అనంతపురం అర్బన్: రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షునిగా దివాకర్ రావు ఎన్నికయ్యారు. కార్యదర్శిగా జి.సోమశేఖర్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక కృష్ణకళా మందిర్‌లోని రెవెన్యూ హోమ్‌లో రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులతో కలిపి మొత్తం 16 స్థానాలకు గానూ 15 స్థానాల్లో దివాకర్ రావు ప్యానెల్ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అసోసియేట్ అధ్యక్షునిగా పి.రజాక్‌వలి, ఉపాధ్యక్షులుగా ఏఎస్ ముక్తియార్ అహమ్మద్, కె.మోహన్ కుమార్, బి.సురేఖరావు, టి.సుబ్రమణ్యం, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డి.ప్రసాద్, క్రీడలు, సాంస్కృతి కార్యదర్శిగా ఆర్.తిప్పేస్వామి, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.అనురాధ, జి.చాంద్‌బాషా, ఎస్.షాహిద్ అక్రమ్, ఆర్.కరుణాకర్, కోశాధికారిగా వి.పునీత్‌బాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా జి.లక్ష్మీపతిరెడ్డి, టి.ఉదయ్ కిరణ్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఆర్.వెంకటరాజేష్ వ్యవహరించారు. విజేతలకు డిక్లరేషన్ అందజేశారు.

దేశ రక్షణలో సైనికుల పాత్ర కీలకం



మాజీ సైనికులను సన్మానించిన దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: దేశ రక్షణలో సైనికుల పాత్ర ఎంతో కీలకమని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు అన్నారు. విజయ్ దివస్ ముగిసి 53 సంవత్సరాలైన సందర్భంగా జిల్లా మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో 1965లో జరిగిన యుద్ధంలో పాల్గొన్న సైనికులను (ప్రస్తుతం మాజీ సైనికులు) ఆదివారం నగరంలోని వీకే భవన్‌లో ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో సార్జెంట్ మల్లికార్జునరెడ్డి, సార్జెంట్ పి.గోవిందరెడ్డి, హవల్దార్ ఎం.నరసింహులు, హవల్దార్ పి.సిద్ధన్న, నీలిరత్నం, సైనికులు ఖాజామొహిద్దీన్, బాబారత్నం, వీరనారులు నాగలక్ష్మి, విజయమ్మ ఉన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గోవిందరాజులు మాట్లాడుతూ... ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశం రక్షణకు శ్రమిస్తున్న సైనికుల సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం గౌరవాధ్యక్షుడు వీకే రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి కెప్టెన్ పట్నం ఉమామహేశ్వరరావు, కోశాధికారి తిమ్మారెడ్డి, పలువురు మాజీ సైనికులు పాల్గొన్నారు.

రక్త కన్నీరు

- హిమోఫీలియా బాధితుల నరకయాతన
- నాలుగు నెలలుగా ఫ్యాక్టర్ ఇంజెక్షన్లు లేని దుస్థితి
- ఆస్పత్రుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్న రోగులు
- డాక్టర్లను వేడుకుంటున్నా ఫలితం శూన్యం
- కూటమి సర్కారు అలసత్వంతో పరిస్థితి దయనీయం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రాణ భయంతో కొట్టుమిట్టాడుతున్న రోగులను కూటమి సర్కారు పట్టించుకోవడం లేదు. కక్ష గట్టి 108 వ్యవస్థను పీడిస్తుండటంతో ఇప్పటికే డయాలసిస్ రోగులకు ఉచిత రవాణా సౌకర్యం నిలిచిపోయింది. దీంతో రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. తాజాగా హిమోఫీలియా బాధితులు అదేకోవలోకి చేరారు.



ఖరీదైన వైద్యం..

హిమోఫీలియా అనేది భయంకరమైన జబ్బు. జన్యు లేదా ఎంజైముల లోపంతో చిన్నతనంలోనే వ్యాధి సంక్రమిస్తుంది. ఎక్కడైనా చిన్న గాయమైనా రక్తస్రావం ఆగదు. వీరికి రక్తం గడ్డకట్టే పరిస్థితి ఉండదు. రక్తం గడ్డ కట్టాలంటే ఫ్యాక్టర్ 8, ఫ్యాక్టర్ 7, ఫ్యాక్టర్ 9 ఇంజెక్షన్లు వాడాలి. వ్యాధి తీవ్రతను బట్టి డాక్టరు సలహాతో రోజూ ఇంజెక్షన్లు వాడాల్సి ఉంటుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 160 మందికి పైగా హిమోఫీలియా బాధితులు ఉన్నారు. వీరికి నాలుగు నెలలుగా ఇంజెక్షన్లు అందుబాటులో లేకుండా పోయాయి. ఏ ప్రభుత్వాసుపత్రికి వెళ్లినా 'ప్రభుత్వం సరఫరా చేయడం లేదు' అనే మాట వినిపిస్తుండటంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. బెంగళూరు, హైదరాబాద్‌కు పరుగులు తీస్తున్నారు.

కూటమి సర్కారు నిర్లక్ష్యం..

ఒక్కో హిమోఫీలియా బాధితుడు సమస్య తీవ్రతను బట్టి నెలకు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకూ వ్యయం చేయాల్సి ఉంటుంది. అయితే, వీరి సౌకర్యార్థం కేంద్ర ప్రభుత్వమే ఇంజెక్షన్లు అందిస్తోంది. జాతీయ హెల్త్ మిషన్ ద్వారా సమన్వయం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఆస్పత్రులకు వీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే, కూటమి సర్కారు ఈ విషయంపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటంతో బాధితులు నిత్యం నరకం చూస్తున్నారు. పదో తరగతి చదివే ఓ హిమోఫీలియా బాధితుడు ఇటీవల నార్పల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రక్తస్రావం నిలవకపోవడంతోనే విద్యార్థి ప్రాణాలు వదలడం గమనార్హం.

గతంలో ఎప్పుడూ కొరత లేదు..

2019–24 మధ్యకాలంలో ఫ్యాక్టర్ 8, ఫ్యాక్టర్ 7 ఇంజెక్షన్లకు ఎప్పుడూ కొరత తలెత్తలేదు. రోగులు ఇబ్బందులు పడకుండా సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచేవారు. ఇక అనంతపురం సర్వజనాసుపత్రిలో కచ్చితంగా స్టాకు ఉండేవి. దీంతో రోగులకు ఎంతో సాంత్వన చేకూరింది.

వైద్యశాఖ మంత్రి ఉన్నా తప్పని దుస్థితి



వైద్యశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి అనంతపురం జిల్లాలో హిమోఫీలియా బాధితులకు దయనీయ పరిస్థితులు తలెత్తడం బాధాకరం. చిన్న పిల్లల పరిస్థితి దారుణంగా ఉంటోంది. ఎప్పుడైనా రక్తస్రావం జరిగితే బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సి వస్తోంది. అయినా, అప్పటి దాకా రక్తస్రావం ఆగక బాధితులు నరకం చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన మందులు సమకూర్చాలి.

– మతం శ్యామ్ సుందర్ శాస్త్రి, హిమోఫీలిక్ సొసైటీ జిల్లా అధ్యక్షులు

సర్కారు కరుణించాలి



హిమోఫీలియా బాధితులకు చిన్నపాటి గాయమైనా రక్తస్రావం ఆగదు. మెట్లు ఎక్కి దిగాలన్నా, ఏదైనా పని చేద్దామన్నా సమస్యే. అంతర్గత రక్త స్రావం దీనికి కారణం. అలా జరిగిన సమయంలో వెంటనే ఇంజెక్షన్ వేయాలి. జాగ్రత్తగా ఉన్నా నెలకు కనీసం 3 వేల నుంచి 5 వేల యూనిట్స్ ఫ్యాక్టర్ అవసరం. పేద కుటుంబాలు బయట కొనుగోలు చేయడం సాధ్యపడదు. ప్రభుత్వం కరుణించాలి.

– షేక్ షెక్షావలి, గుంతకల్లు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇబ్బంది లేదు



గత ప్రభుత్వంలో ఫ్యాక్టర్‌కు కొదవ లేకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏ ఒక్క ఆస్పత్రిలోనూ ఇవి అందుబాటులో లేవు. రోగులందరూ నిరుపేదలే. అలాంటి వారు ఇంజెక్షన్లను బయట కొనుగోలు చేయడం అసాధ్యం. ప్రభుత్వం వెంటనే మందులను అందుబాటులో ఉంచాలి.

– తిమ్మరాజు, హిమోఫీలియా బాధితుడు

ఇం'ధనం' మిగిల్చి..
అవార్డు గెలిచి



అవార్డు అందుకుంటున్న డీఆర్ఎం విజయ్‌కుమార్

గుంతకల్లు: ఇంధన పొదుపులో ప్రతిభ కనబరచిన గుంతకల్లు రైల్వే ఆస్పత్రికి అవార్డు వరించింది. ఈ మేరకు గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజర్ విజయ కుమార్ అవార్డు అందుకున్నారు. గుంతకల్లు రైల్వే డివిజన్ హెడ్ క్వార్టర్స్‌లో రైల్వే ఆస్పత్రి ఉంది. గతంలో ఏడాదికి 2.27 లక్షల యూనిట్ల విద్యుత్ కొనుగోలు చేసేవారు. ఈ క్రమంలోనే ఇంధన పరిరక్షణకు శ్రీకారం చుట్టిన డివిజన్ అధికారులు.. విద్యుత్ పొదుపు చర్యలు చేపట్టారు. విద్యుత్ కొనుగోలును గణనీయంగా తగ్గించుకుంటూ వచ్చారు. ప్రస్తుత ఏడాదిలో కేవలం 96 వేల యూనిట్లకు విద్యుత్ కొనుగోలు భారాన్ని తగ్గించారు. అలాగే, డివిజన్ పరిధిలోని రేణిగుంట రైల్వే జంక్షన్‌లో దాదాపు 7 లక్షల యూనిట్ల నుంచి 2.70 లక్షల యూనిట్లకు పరిమితం చేసి శెభాష్ అనిపించుకున్నారు. దీంతో గుంతకల్లు డివిజన్‌కు రెండు జాతీయ స్థాయి అవార్డులు వరించాయి. శనివారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఉన్నతాధికారుల చేతులమీదుగా డీఆర్ఎం విజయ్‌కుమార్ అవార్డు అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఎల్ఈడీ లైట్లు, సోలార్ లైట్ల వినియోగంతో ఇంధన పొదుపు సాధించామన్నారు. రానున్న రోజుల్లో అన్ని విభాగాల్లోను డివిజన్‌ను ఉత్తమంగా నిలపడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు.



గుంతకల్లు రైల్వే ఆస్పత్రి

ప్రశ్నించే గొంతును నొక్కేస్తున్నారు



ప్రసంగిస్తున్న ఎస్ఎన్ సాహు



హాజరైన మానవ హక్కుల వేదిక ప్రతినిధులు

- విద్యను కాషాయీకరణ చేస్తున్నారు
- ప్రభుత్వాల తీరును అందరూ ప్రశ్నించాలి
- మానవ హక్కుల వేదిక రాష్ట్ర మహాసభల్లో వక్తలు

అనంతపురం కల్చరల్: ప్రశ్నించే గొంతును నొక్కేయడమే పాలకుల పనిగా ఉండడం ఆవేదన కల్గించే అంశమని మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు, మాజీ రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ వద్ద ఓఎస్డీగా పనిచేసిన ఎస్ఎన్ సాహు అన్నారు. సమాజంలో అన్నింటా హక్కులకు భంగం వాటిల్లుతోందన్నారు. అనంతపురం వేదికగా నిర్వహించిన మానవ హక్కుల వేదిక పదో రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో జరిగిన ఈ సభల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ అంశాలపై వక్తలు మాట్లాడారు. 'కుల గణన ఎందుకు అవసరం' అనే అంశంపై ఎస్ఎన్ సాహు ప్రసంగించారు. దేశంలో అనేక ఉపకులాల వారికి రిజర్వేషన్ల విషయంలో అన్యాయం జరుగుతోందన్నారు. కులగణన సక్రమంగా, పారదర్శకంగా లేకపోతే ఆధిపత్య కులాలే రాజ్యాంగ ఫలాలను అనుభవిస్తాయని, అర్హులైన వారు అన్యాయమైపోతారని పేర్కొన్నారు. పాలకులు నిజాయితీగా కులగణన చేయాలని, దాన్ని రాజకీయం చేయొద్దని హితవు పలికారు. సీనియర్ జర్నలిస్టు మాలిని సుబ్రమణ్యం 'బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు' అనే అంశంపై మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఆదివాసీలపై కఠినమైన ఆంక్షలు ఉన్నాయన్నారు. పోలీసులే రాజ్యమేలుతున్నట్లుగా పరిస్థితి తయారైందన్నారు. సామాన్యులు బతకలేని స్థితికి వచ్చేయడం దారుణమన్నారు. అడవుల్లో వ్యవసాయం చేసుకోనీయకుండా ఆధిపత్యం చెలాయించే పద్ధతి పోవాలన్నారు. 'కాషాయీకరణ–కార్పొరేటీకరణ' అనే అంశంపై ఆచార్య కొప్పర్తి వెంకటరమణమూర్తి ప్రసంగిస్తూ.. ప్రస్తుతమంతా మత రాజకీయాలు నడుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హిందూ మతమొక్కటే ఉన్నట్లు అందులోని విషయాలనే విద్యలో చొప్పిస్తుండడం అన్యాయమన్నారు. బీజేపీ పాలకులు రాజ్యాన్ని మతపరంగా మార్చేయకముందే అందరిలో చైతన్యం రావాలన్నారు. ప్రతిదీ కాషాయీకరణ చేస్తుండడం వల్ల దేశం వెనక్కు వెళ్లిపోతోందని ఆందోళన వెలిబుచ్చారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, ఎస్ఎం బాషా, అబ్దుల్ రసూల్, జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న, ఉపాధ్యక్షులు డాక్టర్ శశాంక మౌళి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, తెలంగాణ,ఏపీ హెచ్ఆర్ఎఫ్ నాయకులు శ్రీనివాస్, భుజంగరావు, డాక్టర్ తిరుపతి, సీనియర్ న్యాయవాది రామ్‌కుమార్, శ్రీధర్, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం అజరామరం



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ తదితరులు

అనంతపురం అర్బన్: ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరమని కలెక్టర్ వి.వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి కార్యక్రమానికి కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగానే ఆంధ్రరాష్ట్రం అవతరించిందన్నారు. దృఢ సంకల్పంతో ఎంతటి లక్ష్యాన్నైనా సాధించగలమనేందుకు పొట్టి శ్రీరాములు నిదర్శనమన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. మన ఊరు, రాష్ట్రం, భాష అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక నృత్యప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్ఓ ఎ.మలోల, కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్, బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ డీడీ సుభాషిణి, గిరిజన సంక్షేమాధికారి రామాంజినేయులు, ఐసీడీఎస్ పీడీ వనజాక్కమ్మ, కలెక్టరేట్ విభాగాల అధిపతులు వసంతలత, యుగేశ్వరి, రియాజుద్దీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో వారి చిత్రపటాలకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్‌లు ఆదర్శప్రాయులని కొనియాడారు.

18 నుంచి 'పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్'


అనంతపురం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు 27వ అంతర్ పాలిటెక్నిక్ కళాశాలల టోర్నీ (స్పోర్ట్స్ మీట్) నిర్వహిస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు 700 మంది పాల్గొననున్నారు. ఇందులో గెలుపొందిన వారు త్వరలో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ క్రమంలో స్పోర్ట్స్ మీట్ వాల్‌పోస్టర్లను ఆదివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ ఆదివారం ఆవిష్కరించారు.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి. జయ చంద్రా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం.. 'పచ్చ' నేత శాపం

24 ఏళ్ల చెట్లను జేసీబీతో పీకివేయించిన టీడీపీ నేత



చెట్లు తొలగించడంతో బోసిపోయిన రోడ్డు



రోడ్డుకు దూరంగా ఉన్న వేప చెట్టు కొమ్మలనూ తొలగించిన దృశ్యం

రాప్తాడు: ఒకటి కాదు.. రెండు కాదు.. 24 ఏళ్ల వృక్షాలు. ఎంతో మందికి ఆహ్లాదం, ఆనందం పంచిన చెట్లు.. అలాంటి వాటిని నిర్దాక్షిణ్యంగా పీకివేయించాడో 'పచ్చ' నేత. వివరాలు.. మండల పరిధిలోని కదిరి–బెంగళూరు జాతీయ రహదారి నుంచి గంగలకుంట గ్రామం వరకూ 25 ఏళ్ల క్రితం ఆర్అండ్‌బీ అధికారులు తారు రోడ్డు వేశారు. అప్పట్లో రోడ్డుకిరువైపులా మొక్కలు నాటారు. అవి నేడు వృక్షాలుగా ఎదిగాయి. వేసవిలో బాటసారులు, స్థానికులు ఆ చెట్ల కింద సేదతీరేవారు.

పిచ్చిపట్టినట్టుగా పీకేశారు..

ఎందరికీ ఆహ్లాదం పంచిన చెట్లను వారం రోజుల నుంచి జేసీబీతో ఓ వ్యక్తి పీకేస్తున్నాడు. ఇప్పటికే దాదాపు 20 చెట్లను తొలగించాడు. దీనిపై ఆదివారం కొందరు ప్రశ్నించగా.. పుట్లూరు మండలానికి చెందిన టీడీపీ నేత ఎల్లుట్ల రాజు నాయుడు చెప్పడంతో చెట్లను తొలగిస్తున్నానని జేసీబీ డ్రైవర్ చెప్పాడు. ఈ క్రమంలోనే స్థానికులు టీడీపీ నేతకు ఫోన్ చేయగా.. గంగలకుంట ఆర్అండ్‌బీ రోడ్డుకు ప్యాచ్ వర్క్ కాంట్రాక్ట్ దక్కిందని, అందుకే చెట్లను తొలగిస్తున్నామని తెలిపాడు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో జేసీబీ డ్రైవర్ ఉడాయించాడు. చెట్ల తొలగింపుపై ఎంపీడీఓ విజయలక్ష్మిని సంప్రదించగా.. విషయం తనకు తెలియదని చెప్పారు. పంచాయతీరాజ్ ఏఈఈ రామచంద్రారెడ్డి వివరణ కోరగా.. ఇప్పటివరకూ రోడ్డు పనులు కేటాయించలేదని, ఎల్లుట్ల రాజు అనే వ్యక్తే తనకు తెలియదని చెప్పడం గమనార్హం. ఏదిఏమైనా, 24 ఏళ్ల నుంచి ఉన్న చెట్లను తొలగించిన 'పచ్చ' నేతపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఆకాశ దీపాన్ని ఊరేగింపుగా తీసుకువస్తున్న అర్చకులు

● వెలుగుల ఉత్సవం.. ఆకాశమంత వైభవం

తాడిపత్రి అర్బన్: స్థానిక చింతల వెంకటరమణ స్వామి ఆలయంలో ఆదివారం ఆకాశ దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు స్వామి వారికి అర్చకులు సుప్రభాత సేవ, తిరుమంజన, నక్షత్ర హారతి కార్యక్రమాలను చేపట్టారు. సాయంత్రం 6 గంటలకు ఆకాశ దీపాన్ని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అర్చకులు శాస్త్రోక్తంగా తలపాగా ధరించి దీపాన్ని శిరస్సుపై ఉంచుకుని ఆలయ మాడ వీధుల్లో ప్రదక్షిణ గావించారు. ఈ సందర్భంగా మహిళలు హారతులతో స్వాగతం పలికారు. రాత్రి 7.30 గంటలకు ఆలయం వెలుపల ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్తంభంపై ఆకాశ దీపాన్ని ప్రతిష్ఠించగా... భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి దర్శించుకున్నారు. గోవింద నామస్మరణతో ఆలయాన్ని మార్మోగించారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.



హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

బ్రహ్మ రథోత్సవం.. భక్తజన పరవశం



రథాన్ని లాగుతున్న భక్తులు

మడకశిరరూరల్: అశేషంగా తరలివచ్చిన భక్తజనం గోవిందనామ స్మరణ నడుమ భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మ రథోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. తొలుత ఉత్సవమూర్తులను భక్తుల సమక్షంలో ఊరేగింపుగా తీసుకువచ్చి రథంలో కొలువుదీర్చారు. పురోహితులు హోమం, విశేష పూజలు నిర్వహించిన అనంతరం రథాన్ని లాగారు. ఆ సమయంలో భక్తులు బొరుగులు, అరటిపండ్లు రథంపైకి విసిరి భక్తిప్రపత్తులు చాటుకున్నారు. రథం వద్ద ప్రసాదం తీసుకోవడానికి, కొబ్బరి కాయలు కొట్టడానికి భక్తులు పోటీ పడ్డారు. అనంతరం ఆయా దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేయించారు. దాతలు భక్తులకు ప్రసాదం పంచిపెట్టి మొక్కులు తీర్చుకున్నారు. రొళ్ల జెడ్పీటీసీ ఆనంతరాజు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి రథోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాగిరి రామయ్య ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

బాధ్యతగా విధులు నిర్వర్తించండి

- ఐసీడీఎస్ పీడీకి కలెక్టర్ సూచన



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు మొక్క అందజేస్తున్న ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ

అనంతపురం అర్బన్: విమర్శలకు తావివ్వకుండా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. పీడీగా నియమితులైన ఆమె ఆదివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అందరినీ సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం చేయాలని సూచించారు.

ఆర్టీసీ బస్సులో కర్ణాటక మద్యం సరఫరా



పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

కణేకల్లు: కర్ణాటకలోని బళ్లారి నుంచి కళ్యాణదుర్గానికి అక్రమంగా ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న మద్యాన్ని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించి, సీజ్ చేశారు. ఆదివారం ఉదయం బళ్లారి నుంచి బయలుదేరిన కళ్యాణదుర్గం డిపో బస్సులో కళ్యాణదుర్గానికి చెందిన బోయ వన్నూరుస్వామి, బోయ మహేష్ 6 సంచుల్లో 576 హైవార్డ్స్ టెట్రా ప్యాకెట్లను తీసుకుని బయలుదేరారు. కణేకల్లు మండలం కణేకల్లు క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేపట్టిన అనంతపురం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అన్నపూర్ణ, సీఐ హరికృష్ణ, హెడ్ కానిస్టేబుల్ తదితరులు బస్సులో తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు.

నేటి నుంచి ధనుర్మాసం

హిందూపురం అర్బన్: విష్ణుమూర్తికి ఇష్టమైన మాసం ధనుర్మాసం సోమవారం నుంచి నెలరోజుల పాటు కొనసాగనుంది. సూర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశించడంతో ధనుర్మాసం ప్రారంభమవుతుంది. ఈ నెల రోజుల పాటు వైష్ణవాలయాల్లో విశేషమైన పూజలు, సేవలు ఉంటాయి. ఈ మాసంలో మేలుకొలుపులు, గంగిరెద్దుల విన్యాసాలు, కోడి పందేలు, ఇళ్ల ముందు రంగవల్లుల సందడి ఉంటుంది. తాము పండించిన పంటను ఓ పండుగ వాతావరణంలో రైతులు ఇంటికి చేరుస్తుంటారు. దేవాలయాల్లో గోదారంగనాథ స్వాముల కల్యాణోత్సవాలు నేత్రపర్వంగా నిర్వహిస్తుంటారు. ఈ మాసంలో వచ్చే ముక్కోటి ఏకాదశి నాడు మహావిష్ణువుని ఉత్తర ద్వారం ద్వారా వెళ్లి దర్శిస్తే సకల దేవతలు దీవిస్తారనేది నమ్మకం.

అమ్మో 'ఏ-1 సీటా'!

- కలెక్టరేట్ పరిపాలన విభాగంలో కీలక స్థానం
- ఆ స్థానంలో పనిచేసేందుకు ఉద్యోగుల విముఖత
- అనుభవజ్ఞులకు కేటాయించడంపై దృష్టి సారించని అధికారులు



కలెక్టరేట్‌లోని పరిపాలన విభాగంలో ఉన్న ఎ-1 సీటు

అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లోని కీలక స్థానాల్లో విధులు నిర్వర్తించేందుకు పలువురు ఉద్యోగులు విముఖత చూపిస్తున్నారు. నెల రోజులుగా కలెక్టరేట్ పరిపాలన విభాగంలో కీలకమైన ఎ-1 సీటు ఖాళీగా ఉండడమే ఇందుకు నిదర్శనం. ఈ సీటుకు ఎవరైనా వెళతారా అంటే 'అమ్మో ఎ-1 సీటా' మాకొద్దు బాబోయ్ అంటూ రెవెన్యూ ఉద్యోగులు ముఖం చాటేస్తున్నారు. కలెక్టరేట్‌లో పరిపాలన విభాగం అత్యంత కీలకమైతే.. ఇందులో ఎ-1 సీటు మరింత కీలక స్థానం. ఐఏఎస్, డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఉద్యోగుల సర్వీస్ మ్యాటర్లను ఏ-1 సీటును కేటాయిస్తారు. ఈ సీటులో పనిచేసే ఉద్యోగిపై పని ఒత్తిడి తీవ్రంగా ఉంటుంది. అంతే కాకుండా విధుల నిర్వర్తనలో నిర్దిష్ట సమయమంటూ ఉండదు. ఈ సీటులో ఉద్యోగి అర్ధ రాత్రి వరకు విధులు నిర్వర్తించిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. దీంతో ఈ సీటులో కూర్చొనేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. పరిపాలన వ్యవహారాల్లో అనుభవం ఉన్న ఉద్యోగులు మాత్రమే ఈ సీట్‌లో పనిచేయగలరు. అయితే ఆ దిశగా కలెక్టరేట్ అధికారులు దృష్టి సారించడం లేదు.

అందరూ కొత్తవారే...

పరిపాలన విభాగంలో పరిపాలనాధికారి మొదలు అందరూ కొత్తవారే ఉన్నారు. వీరికి పరిపాలన అంశాలపై అవగాహన, అనుభవం అంత మాత్రమే అని తెలుస్తోంది. పాలన అంశాలపై అనుభవం ఉన్న ఆంజనేయులను కళ్యాణదుర్గం ఆర్‌డీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. ఎ-4 సీటులో విధులు నిర్వర్తిస్తున్న భరత్‌ను కలెక్టర్ సీసీగా నియమించారు. ప్రస్తుతం ఎ-1 ఖాళీ ఉండగా ఎ-2గా ముక్తియర్, ఎ-3గా ఉమేర, ఎ-4గా లీలాకాంత్ పనిచేస్తున్నారు. లీలాకాంత్ మినహా ఏఓ నుంచి అన్ని సీట్లలో కొత్తవారే ఉన్నారు. కనీసం ఎ-1 సీటులోనైనా పాలనాంశాల్లో అనుభవం ఉన్న ఉద్యోగిని నియమిస్తే బాగుంటుందనే అభిప్రాయం కలెక్టరేట్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

సమస్యలు పరిష్కరించండి

- సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకుల డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: గ్రామ సచివాలయ సంక్షేమ, విద్యా సహాయకుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ సచివాలయ సంక్షేమ, విద్యా ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. అనంతరం విలేకరులతో సంఘం గౌరవాధ్యక్షులు అల్లపరెడ్డి సాయినాథరెడ్డి, మాసినేని శ్రీపతి మాట్లాడారు. గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో సచివాలయ ఉద్యోగుల కృషి ఎనలేనిదన్నారు. ముఖ్యంగా పేదరిక నిర్మూలన, సంక్షేమ పథకాల అమలు అంశాల్లో గతంలో రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయస్థాయిలో అవార్డులు రావడంలో సంక్షేమ, విద్యా సహాయకులు కీలకపాత్ర పోషించారన్నారు. సామాజిక భద్రత పింఛన్ల నమోదు మొదలు... పంపిణీ వరకూ వీరిదే కీలక బాధ్యత అన్నారు. చంద్రన్న బీమా, హౌసింగ్ పథకంలో రుణాల నమోదు, పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల వెరిఫికేషన్, విద్యార్థుల స్థూల నమోదు నిష్పత్తి, మధ్యాహ్న భోజన పర్యవేక్షణ, తదితర విధులను నిబద్ధతతో నిర్వర్తిస్తున్నారన్నారు. ఇలాంటి సహాయకుల ప్రధాన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు శివకృష్ణారావు, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, జిల్లా నాయకులు కులశేఖర్‌రెడ్డి, అనిల్, సల్మాన్ బాషా, ఈషాన్, ఆంజనేయులు, నరేంద్ర, సత్య, సురేష్‌నాయక్, కార్తీక్, రవితేజ, దస్తగిరి, కల్యాణ్, చంద్రశేఖర్‌రెడ్డి, ఓబులనాయుడు, అమర్‌నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన సమస్యలు ఇవే

- పదోన్నతి ఛానల్ సౌకర్యం కల్పించాలి. జాబ్ టైటిల్‌ను సంక్షేమ, విద్యా కార్యదర్శిగా మార్చాలి.
- అటెండెన్స్ యాప్ ఒక్కటే ఉండాలి. పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యతలను రద్దు చేయాలి.
- సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ సమయం ఉదయం 6 కాకుండా 8 గంటలకు ప్రారంభించేలా సవరించాలి.
- ఇంటింటికీ తిరిగి చేసే వివిధ సర్వేలలో రోజువారీ లక్ష్యాలు విధిస్తూ ఒత్తిడికి గురిచేయకుండా పనిచేసే వాతావరణం కల్పించాలి.
- విధి నిర్వహణలో మల్టీపుల్ బాసిజం లేకుండా చూడాలి. రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు, 9 నెలల పెండింగ్ బకాయిలు చెల్లించాలి.

ఇసుక దోపిడీ... అక్రమ రాబడి

- ప్రకృతి సంపదను ఆదాయవనరుగా మార్చుకున్న టీడీపీ నేతలు
- యథేచ్ఛగా ఇసుక అక్రమ తరలింపు
- టిప్పర్లు, పది చక్రాల లారీలతో బెంగళూరుకు రవాణా
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- పట్టించుకోని అధికారులు



కన్నేపల్లి సమీపంలో వేదావతి హగరి నదిలో ట్రాక్టర్‌లో ఇసుక నింపుతున్న దృశ్యం

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలోని ప్రకృతి సంపదపై టీడీపీ నేతలు కన్నేశారు. ప్రధానంగా విస్తారంగా ఇసుక ఉన్న వేదవతి హగరి, పెన్నానదీ పరివాహక ప్రాంతాలతో పాటు చెరువులు, వంకలను అప్పనంగా దోచేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నేతల అక్రమ ఇసుక దందా రేయింబవళ్లూ సాగుతోంది. ప్రధానంగా నియోజకవర్గంలోని కంబదూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం మండలాల్లో ఇసుక అక్రమ తరలింపు తారాస్థాయికి చేరుకుంది. నదీ పరివాహక ప్రాంతాలు, చెరువులు, వంకల్లో జేసీబీ, హిటాచీలను ఏర్పాటు చేసి, పది చక్రాల లారీలు, టిప్పర్లతో పాటు ట్రాక్టర్లలోనూ యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా డిమాండ్ ఎక్కువగా ఉన్న బెంగళూరుకు ఎక్కువ మొత్తంలో ఇసుక తరలిస్తున్నారు. అక్కడ టన్ను రూ.లక్షకు పైగా విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. వంక పక్కన ఉన్న పొలాల్లో ఇసుకను ట్రాక్టర్లు, టిప్పర్ల సాయంతో తరలిస్తున్నారు.

చీకటి పడితే చాలు..

నియోజకవర్గంలోని పలు మండలాల్లో చీకటిపడితే చాలు ఇసుకాసురులు నిద్రలేస్తున్నారు. ముఖ్యంగా బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లి, పోలేపల్లి, వేపులపర్తి, కుర్లగుండ గ్రామాల సమీపంలోని వేదవతి హగరి నదీ పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను పెద్ద మొత్తంలో కొల్లగొడుతున్నారు. అలాగే కంబదూరు మండలం చెన్నంపల్లి, రాంపురం, గూళ్యం, నూతిమడుగు, జెల్లిపల్లి, రాళ్లపల్లి, కర్తనపర్తి గ్రామాలు, కళ్యాణదుర్గం మండలం తిమ్మసముద్రం, బాలవెంకటాపురం, వెంకటంపల్లి, కొండాపురం, మంగళకుంట, ముద్దినాయనపల్లి తదితర గ్రామాల్లోని పెన్నానదీ పరివాహక ప్రాంతాల నుంచి రోజూ టన్నుల కొద్దీ ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. స్థానికంగా ఇసుక అవసరమున్న వారికి టన్ను రూ.2,500తో విక్రయిస్తున్నారు. రోజుకు వందల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది.

అడ్డుకుంటే బెదిరింపులు..

ఇసుక అక్రమ రవాణాపై ఆయా ప్రాంతాల్లో తరలింపుదారులను అడ్డుకుని నిలదీసిన స్థానికులపై టీడీపీ నేతలు బెదిరింపులకు దిగుతున్నారు. అలాగే ఇసుక తరలిస్తున్న విషయం ఎవరికైనా చేరవేసినా అంతుచూస్తామంటూ హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. ఈ తతంగాన్ని సహించలేని కొందరు యువకులు విషయాన్ని వెంటనే అధికారులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్ళినా ఎలాంటి ఫలితం లేకపోతోంది. ఇసుక అక్రమ రవాణాపై అధికారులు సైతం పెదవి విప్పకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ సంపాదన, మామూళ్ల మత్తులో పడి అధికారులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడం లేదని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

సీమ సంస్కృతిని ప్రతిబింబించిన 'రాయలసీమ రత్నాలు'



- పుస్తకావిష్కరణలో పాల్గొన్న ముఖ్య వక్తలు

అనంతపురం కల్చరల్: రాయలసీమ రత్నాలు పేరుతో 140 మంది కవులు సాగించిన కవితాగానం సీమ సంస్కృతిని ప్రతిబింబించింది. ఆదివారం అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ప్రాంగణంలో కేంద్ర అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని సీనియర్ సాహితీవేత్తలు బండి నారాయణ స్వామి, డాక్టర్ శాంతినారాయణ, సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి, జలసాధన సమితి రాంకుమార్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... తిమ్మాపురం బాలకృష్ణారెడ్డి, మెట్టుపల్లి సుదర్శనరెడ్డి స్మారకంగా కవి సమ్మేళనం ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన మానవత సంస్థ తరిమెల అమరనాథరెడ్డి, లోచర్ల విజయభాస్కర రెడ్డి, ఈశ్వరరెడ్డి, విద్యావంతుల చైతన్య వేదిక అరుణ్ రత్నం మాట్లాడుతూ... అభివృద్ధి విషయంలో తరాలుగా రాయలసీమ ప్రాంత వాసులు మోసపోతూనే ఉన్నారని, వెనకబడిన జిల్లాలో హంద్రీనీవా కాలువల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంగా జిల్లావాసుల్లో చైతన్యం తీసుకువచ్చేలా రచయితలు కృషి చేయాలని సూచించారు. అనంతరం సీనియర్ కవి మల్లెల నరసింహమూర్తి రచించిన 'మాకు నది కావాలి', కడప రామాంజనేయులు రచించిన 'సద్ద కంకి' పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రాయలసీమ చిత్రలేఖన ప్రదర్శన, పుస్తకాల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. కార్యక్రమం చివరన పలువురు కవులను సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ కవులు ఏలూరు యంగన్న, సడ్లపల్లి చిదంబరరెడ్డి, రియాజుద్దీన్, ఆకుల రఘురామయ్య, మధురశ్రీ, షరీఫ్, కుంచెశ్రీ, ఎల్ఆర్ వెంకటరమణ, సాంస్కృతిక వేదిక నిర్వాహకులు రవికుమార్, నాగోషారెడ్డి, వన్నూరుసాహెబ్, స్వామి, లోకన్న, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠ పోరులో కర్నూలు విజయం



వైజాగ్ క్రీడాకారుడిని గోల్‌పోస్టు వద్ద అడ్డుకుంటున్న కర్నూలు క్రీడాకారులు



మూడో స్థానంలో నిలిచిన అనంతపురం జట్టు

- హోరాహోరీగా సాగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ ఫైనల్ మ్యాచ్
- రన్నరప్‌ను దక్కించుకున్న వైజాగ్ జట్టు

రాప్తాడు: మండలంలోని గొల్లపల్లి వద్ద ఉన్న మాంటిస్సోరీ ఎలైట్ పాఠశాల ఆవరణలో ఆదివారం జరిగిన 10వ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ (పురుషుల) ఫైనల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. నువ్వా నేనా అనే రీతిలో క్రీడాకారులు తలపడ్డారు. ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో వైజాగ్ జట్టుపై కర్నూలు జట్టు విజయం సాధించింది. రెండో స్థానంలో వైజాగ్, మూడో స్థానంలో అనంతపురం, చిత్తూరు జట్లు నిలిచాయి. విజేత జట్లను అభినందిస్తూ ట్రోఫీలను ముఖ్యఅతిథులు సీఐ టీవీ శ్రీహర్ష, మాంటిస్సోరి పాఠశాల ఎండీ కృష్ణభరత్, కళాశాల ఇన్‌చార్జి మధు, హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివశంకర్ అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఎస్.కే శివమూర్తి, రాష్ట్ర సంఘం సభ్యుడు విజయ్‌కుమార్, కార్యదర్శి శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, రాజశేఖర్ రెడ్డి, మురళి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి సుగుణమ్మ, సీనియర్ పీడీలు నాగరాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక డీజిల్ డంప్ స్వాధీనం



కర్ణాటక డీజిల్‌ను సీజ్ చేస్తున్న పోలీసులు

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్లలో ఎలాంటి అనుమతులు లేకుండా కర్ణాటక నుంచి పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకుని విక్రయిస్తున్న డీజిల్‌ను పోలీసులు గుర్తించి సీజ్ చేశారు. అందిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ గౌస్ మహమ్మద్‌బాషా, సిబ్బంది పెనకచెర్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. డీజిల్ విక్రయిస్తున్న చిరంజీవి ఇంటి ఆవరణలో పెద్ద పెద్ద డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 2వేల లీటర్ల డీజిల్, బొలెరో, ఆటో వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రూరల్ ఫుట్‌బాల్ లీగ్ విజేత 'పురం'



విజేతగా నిలిచిన హిందూపురం టౌన్ ఫుట్‌బాల్ క్లబ్ బాలికల జట్టు

హిందూపురం టౌన్: ఆర్డీటీ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలో జరిగిన అండర్-14 బాలికల ఫుట్‌బాల్ సూపర్ లీగ్ టోర్నీ విజేతగా హిందూపురం టౌన్ ఫుట్‌బాల్ క్లబ్ జట్టు నిలిచింది. ఉరవకొండ జట్టుతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తలపడిన హిందూపురం జట్టు 4 గోల్స్ తేడాతో విజయం సాధించింది. అనంతరం విజేతలకు ఆర్డీటీ ఫుట్‌బాల్ కోఆర్డినేటర్ కిషోర్‌బాబు, కోచ్ దుర్గాప్రసాద్ ట్రోఫీలను అందించారు. అలాగే బాలుర సూపర్ లీగ్ ఫైనల్ మ్యాచ్‌లో చాపిరి జట్టుపై 7 గోల్స్ తేడాతో హిందూపురం యునైటెడ్ క్లబ్ జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో వివిధ క్లబ్ మేనేజర్లు, కోచ్‌లు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 1994-99లో పదో తరగతి చదువుకున్న వారందరూ ఒక్కటయ్యారు. నాటి తమ అల్లర్లును గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు బాలాజీ, బాషా, అంజి, శివ, హరి, మల్లికార్జున, చంద్ర, రంజిత్, మధు, కేదార్ తదితరులు నేతృత్వం వహించారు.

వైభవం.. బ్రహ్మరథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న వేలాదిమంది భక్తులు

- ఏపీ, కర్ణాటక భక్తులతో పోటెత్తిన డి.హీరేహాళ్

డి హీరేహాళ్(రాయదుర్గం): జిల్లాలోని కర్ణాటక సరిహద్దున ఉన్న డి.హీరేహాళ్ మండలంలో ప్రసిద్ధి చెందిన నీలకంఠేశ్వరుడి బ్రహ్మ రథోత్సవం ఆదివారం సాయంత్రం అత్యంత వైభవంగా సాగింది. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులతో డి.హీరేహాళ్ వీధులు కిక్కిరిసాయి. నందికోలు, చెక్కభజన, కోలాటం, బొమ్మల ప్రదర్శనతో కళాకారులు ఆకట్టుకున్నారు. కాగా, ఆదివారం వేకుజాము నుంచే ఆలయంలో విశేష అభిషేకాలు, పూజలు, అర్చనలు పెద్ద ఎత్తున జరిగాయి. తొలుత మడితేరు నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు స్వామి ఉత్సవ మూర్తిని వేదమంత్రోచ్ఛరణల మధ్య పల్లకీలో తీసుకొచ్చి బ్రహ్మరథంపై అధిష్టింపజేసి హర నామస్మరణతో ముందుకు లాగారు. పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. కాగా, రాయదుర్గం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలసి నీలకంఠేశ్వరుడి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం రథం లాగి మొక్కుతీర్చుకున్నారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ హెచ్.లక్ష్మి, నాయకులు గొడిశెలపల్లి రవీంద్రానాథ్‌రెడ్డి, తొండ వెంకటేశులు, రహంతుల్లా, అంజిరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, సింగాడి జగదీష్, సర్పంచ్ పరమేష్, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో నీలకంఠేశ్వరుడు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

యువకుడి దుర్మరణం



రమేష్‌బాబు (ఫైల్)

బొమ్మనహళ్: ప్రమాదవశాత్తు వాహనం పై నుంచి కిందపడి ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిర నియోజకవర్గ పరిధిలోని అమిదాలగొంది మండలం ఈ.రామగిరి గ్రామానికి చెందిన రమేష్‌బాబు(24) దినసరి కూలిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కర్ణాటకలోని దొడ్డబళ్లాపురం పట్టణానికి చెందిన ఐచర్ (కేఏ 43ఏ 3621) వాహనానికి కూలీగా వచ్చిన రమేష్‌బాబు కర్నూలు, పత్తికొండ ప్రాంతాల్లో గొర్రెల ఎరువును బస్తాల్లో నింపి బొమ్మనహళ్ మండలం దుద్దేకుంట గ్రామం మీదుగా తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున దుద్దేకుంట గ్రామ సమీపంలోకి చేరుకోగానే రాగానే వాహనంలోని బస్తాలకు కట్టిన తాళ్లు వదులైనట్లుగా గమనించిన డ్రైవర్ వాహనాన్ని రోడ్డు పక్కన ఆపాడు. రమేష్‌బాబు లారీ పైకి ఎక్కి తాళ్లు సరిచేస్తుండగా డ్రైవర్ వాహనాన్ని ముందుకు నడిపాడు. దీంతో రమేష్‌బాబు అదుపు తప్పి తల కిందులుగా కిందపడ్డాడు. తల ఛిద్రం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి ఈశ్వరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

నేడు జ్యోతులు, భూతప్ప ఉత్సవాలు

మడకశిరరూరల్: భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే జ్యోతులు, భూతప్ప ఉత్సవాలు సోమవారం జరగనున్నాయి. సంతానం లేని మహిళలు, వివిధ వ్యాధుతో బాధపడుతున్నవారు తడిస్నానం చేసి భూతప్పలు వచ్చే దారిలో బోర్ల పడుకుంటారు. భూతప్పలు వారిపై కాలుమోపుతూ వస్తారు. భూతప్పల కాలి స్పర్శతో రోగాలు నయమవుతాయని, కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు ఆదివారమే తరలివచ్చారు. ఉత్సవాలకు ఒక డీఎస్పీ, ఆరుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలు, 195 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

నగర పాలక సంస్థ కమిషనర్‌గా రామలింగేశ్వర్



అనంతపురం కార్పొరేషన్: నగర పాలక సంస్థ కమిషనర్‌గా రామలింగేశ్వర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న కమిషనర్ జి.నాగరాజు రెండు నెలల పాటు దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. దీంతో అదనపు కమిషనర్‌గా ఉన్న రామలింగేశ్వర్‌కు ఫుల్ అడిషనల్ చార్జ్ (ఎఫ్ఏసీ) ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. కమిషనర్ నాగరాజు ఈ ఏడాది సెప్టెంబర్ 18న బాధ్యతలు తీసుకున్నారు. మూడు నెలలు కూడా గడవకముందే ఆయన దీర్ఘకాలిక సెలవులో వెళ్లడం చర్చనీయాంశమైంది.

ఖురాన్ కంఠస్త పోటీల్లో ప్రతిభ



బహుమతి అందుకున్న చిన్నారి

అనంతపురం కల్చరల్: ఖురాన్ కంఠస్తం చేసిన చిన్నారులు అభినందనలందుకున్నారు. ఆదివారం స్థానిక ఆదర్శనగర్‌లోని మసిద్-ఏ ఇస్మాయిల్ బియాబానిలో ఖురాన్ కంఠస్త పోటీలు నిర్వహించారు. యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఖురానిక్ స్టడీస్ వారి ఆధ్వర్యంలో జరిగిన క్వార్టర్ ఫైనల్ పోటీలకు సంస్థ కో ఆర్డినేటర్ అబ్దుల్ రహ్మాన్ సూఫీ ముఖ్య అతిథిగా విచ్చేసి చిన్నారుల ప్రతిభను కొనియాడారు. మౌలానా హఫీజ అబ్దుల్ హఖ్, అనీసుర్ రహమాన్, హఫీజ్ షకీల్ ఉమ్రీలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. జిల్లా వ్యాప్తంగా 110 మంది విద్యార్థుల్లో 11 మందిని ఉత్తమ ప్రదర్శనతో సెమీఫైనల్‌కు పంపిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షులు యాసిర్ అహ్మద్, నవాజ్ అహ్మద్, నాయకులు జమీర్, హసన్, షేక్షా తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటి రోడ్డు మంత్రాలయ రాఘవేంద్రస్వామి ఆలయంలో ఆదివారం రథోత్సవ వేడుకలు కమనీయంగా జరిగాయి. మఠంలోని రాఘవేంద్రుల బృందావనాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం రథోత్సవం పురవీధుల్లో కళాకారుల భజన గీతాల నడుమ సాగుతున్నప్పుడు భక్తులు అడుగడుగునా హారతులు పట్టారు.

• పలు చోట్ల సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, సాయి దత్త వ్రతాలు ఘనంగా జరిగాయి. వలీస్వామి ఆశ్రమంలో దత్త జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అక్కల్‌కోట మహారాజ్ పీఠాన్ని సరంగ సుందరంగా అలంకరించి నిర్వాహకులు విజయ్‌కుమార్ నేతృత్వంలో పండితులు దత్త వ్రతాలను శాస్త్రోక్తంగా జరిపించారు. ప్రశాంతి నగర్‌లోని ఔదంబర వృక్షం వద్ద పౌర్ణమి వేడుకలు జరిగాయి. శారదా చంద్రమౌళి ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులు దత్తాత్రేయున్ని దర్శించుకుని తీర్థప్రసాదాలనందుకున్నారు.

షేక్ సాబ్జి పోరాటాలే స్ఫూర్తి



షేక్ సాబ్జి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యమ నేత, దివంగత ఎమ్మెల్సీ షేక్ సాబ్జి పోరాటాలను ఉపాధ్యాయులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు పిలుపునిచ్చారు. యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం దివంగత ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మొదటి వర్ధంతి సభ నిర్వహించారు. షేక్ సాబ్జి చిత్రపటానికి యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. కోటేశ్వరప్ప మాట్లాడుతూ షేక్ సాబ్జి 1989లో ఉపాధ్యాయ జీవితం ప్రారంభించి 2021లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారన్నారు. తన వంతు బాధ్యతగా ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలు చేశారని గుర్తు చేశారు. పోరాడే వారిదే జెండా, పోరాటలదే విజయం అని ఎప్పుడూ చెప్పేవారన్నారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్వీ రమణయ్య, జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, సీనియర్ నాయకులు నాగేంద్ర, ఆడిట్ కమిటీ మెంబర్ గంగాధర్, పవన్ కుమార్, నారాయణస్వామి పాల్గొన్నారు.

నల్లలమ్మకు విశేష పూజలు

రాప్తాడు: బుక్కచెర్లలో నల్లలమ్మ ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలే కాక ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రగతి.. అధోగతి

నగరపాలక సంస్థ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.వందల కోట్ల అభివృద్ధి జరిగింది. ఐదేళ్లలో రెండున్నరేళ్లు కోవిడ్‌తో గడిచిపోయినా అభివృద్ధి, సంక్షేమం ఎక్కడా ఆగలేదు. అయితే, కూటమి ప్రభుత్వంలో నగర ప్రగతి తిరుగుముఖం పట్టింది. అభివృద్ధి పనుల జాప్యం, పడకేసిన పారిశుధ్యం, ఇష్టారాజ్యంగా బిల్లుల చెల్లింపులు, సీ బిల్లుల్లో అవకతవకలు, అనర్హులకు అందలం వెరసి నగరపాలక సంస్థలో పరిపాలన అస్తవ్యస్థంగా మారింది.

- ఆరు నెలల్లో అభివృద్ధి శూన్యం
- నిలిచిపోయిన రూ.13 కోట్ల పనులు
- పడకేసిన పారిశుధ్యం
- ఇష్టారాజ్యంగా బిల్లుల చెల్లింపులు
- రాజకీయ ఒత్తిళ్లతో సెలవులో కమిషనర్!



నగరపాలక సంస్థ వివరాలు..

50	డివిజన్లు
74	సచివాలయాలు
79,147	నివాసగృహాలు
3,40,000	నగర జనాభా

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి సాధారణ, ఆర్థిక సంఘం, ఎస్ క్యాప్ నిధులకు సంబంధించి రూ.13 కోట్ల అభివృద్ధి పనులు (80 పనులకుపైగా) అర్ధంతరంగా నిలిచిపోయాయి. అధికార పార్టీకి చెందిన నాయకులకు పర్సెంటేజీ ఇస్తేనే పనులు చేపట్టాలని హుకుం జారీ చేశారు. దీంతో పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకురాని పరిస్థితి. నగరంలో 50 డివిజన్లలోని 74 సచివాలయాల పరిధిలో రోడ్లు, కాలువ పనులు ఆగిపోయాయి. ఇష్టారాజ్యంగా సీ బిల్లులు చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన చోటా నాయకులే రూ.లక్షల్లో సీ బిల్లులు పెడుతున్నట్లు నగరపాలక సంస్థ రికార్డుల్లో నమోదయ్యాయి. అద్దె వాహనాలకు సంబంధించి అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఈఈలు రాధాకృష్ణ, షాకీర్, వాటర్ సప్లైకు ఓ వాహనాన్ని కేటాయించారు. వీటిని సీ బిల్లు ద్వారా అధికారులే డ్రా చేసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. క్వాలిటీ కంట్రోల్ నివేదికకు సంబంధించిన టెండర్ కేటాయింపులోనూ అధికార పార్టీకి చెందిన నాయకుల అతి జోక్యంతో ఆ పనులు ఆగిపోయాయి. కుక్కల స్టెరిలైజేషన్ పేరుతో ఓ ఏజెన్సీకి నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజు ఏకంగా రూ.14 లక్షల చెక్కు ఇవ్వడం విమర్శలకు దారితీసింది.

పడకేసిన పారిశుధ్యం..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నగరంలో ఇంటింటా చెత్త సేకరణ చేయడంతో పాటు బయో మైనింగ్ ద్వారా నిర్వహణ చేపట్టారు. నగరంలో 47 'క్లాప్' ఆటోల ద్వారా చెత్త సేకరించేలా రూపకల్పన చేయడంతో పాటు నగరపాలక సంస్థకు చెందిన మరో 60 వాహనాల ద్వారా రోజూ 140 టన్నుల చెత్త సేకరణ జరిగేది. అయితే, ఇటీవల 'క్లాప్' ఆటోలు ఆగిపోవడంతో చెత్త సేకరణ జరగడం లేదు. రోజూ చెత్త తరలింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది.

ఐఏఎస్ ఉంటేనే..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏ గ్రేడ్ కమిషనర్లతో పాటు ఐఏఎస్ అధికారిని కమిషనర్‌గా నియమించేలా చర్యలు తీసుకున్నారు. కమిషనర్లుగా పీవీవీఎస్ మూర్తి, ఐఏఎస్ అధికారి మేఘ స్వరూప్ ఉన్న సమయంలో నగరాభివృద్ధికి పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఐఏఎస్ అధికారి ఉన్న సమయంలో ఉద్యోగులు, కార్మికులు నిబద్ధతతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించారు. అయితే, కూటమి ప్రభుత్వంలో నియమించిన అధికారులు ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తించడం విమర్శలకు దారి తీసింది. ఈ క్రమంలోనే బిల్లులు చేయాలని, పర్సెంటేజీ ఇచ్చే వరకు బిల్లు ఫార్వర్డ్ చేయవద్దని అధికారులపై ఒత్తిళ్లు రావడంతో ఇక్కడ పని చేసేందుకు అధికారులు జంకుతున్నారు. నగరపాలక సంస్థ కమిషనగా ఉన్న నాగరాజు రాజకీయ ఒత్తిళ్లతో దీర్ఘకాలిక సెలవులో వెళ్లిపోయారు. ఇదిలా ఉంటే, 2014–19 సమయంలోనూ కమిషనర్లుగా పని చేసిన చల్లా ఓబులేసు, ఉమామహేశ్వర్, సురేంద్రబాబు అప్పటి పాలకుల నిర్వాకంతో హడలిపోయి, 'అనంతపురం వద్దు మహాప్రభో' అంటూ వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వంలో నేడు అలాంటి పరిస్థితులే నెలకొన్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి అవసరమని నగరపాలక సంస్థ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

అనర్హులకు అందలం..

నగరపాలక సంస్థలో అధికారులు, సిబ్బంది విధులకు సంబంధించిన అంశంపై టీడీపీ నాయకులు అతిజోక్యం చేసుకుంటున్నారు. ఇటీవల రెవెన్యూ విభాగంలో నిబంధనలకు విరుద్ధంగా ఇద్దరు ఆర్ఓలు, నలుగురు ఆర్ఐలను మార్చడం దుమారం రేపింది. కొందరు ఆర్ఐలపై తీవ్రస్థాయిలో ఆరోపణలున్నా.. మళ్లీ వారికి కేటాయించడం వెనుక రూ.లక్షల్లో చేతులు మారినట్లు సమాచారం. ఇక.. టౌన్ ప్లానింగ్ విభాగంలో పూర్తి స్థాయిలో అధికారులు, సిబ్బంది లేకపోవడంతో నగరంలో భవనాల అతిక్రమణలు జరుగుతున్నాయి.

ఘనంగా దత్తాత్రేయ జయంతి



దత్త వ్రతం జరిపిస్తున్న పీఠాధిపతి విద్యానృసింహ భారతి

అనంతపురం కల్చరల్ : అజ్ఞానాంధకారాన్ని తొలగించి లోకానికి వెలుగు రేఖలు ప్రసరింపజేసిన దత్తాత్రేయుని జయంత్యుత్సవాలు ఆదివారం వాడవాడలా ఘనంగా జరిగాయి. నగర శివారులోని భ్రమరాంబ కాలనీ శృంగేరీ విరూపాక్ష మఠంలో పీఠాధిపతి విద్యా నృసింహభారతి స్వయంగా దత్తపూజలు జరిపించారు. పాతూరులోని ప్రాచీన దత్తాత్రేయస్వామి ఆలయంలో ఉదయం దత్తహోమం, స్వామివారికి అభిషేక అలంకార సేవలు, దత్తనామకరణ బ్రహ్మోపదేశం, శ్రీదత్తభిక్ష వంటి కార్యక్రమాలు జరిగాయి. అప్పా సుధీర్ ఆధ్వర్యంలో వందలాది మందికి అన్న ప్రసాద వితరణ చేశారు. జెడ్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమంలో దత్తాత్రేయుని వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో నగరోత్సవం జరిగింది. మూడోరోడ్డు, వేమన టెలిఫోన్ భవన్ ఎదురుగా ఉన్న శ్రీసాయిబాబా మందిరాలలో అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరి...స్వామివారిని దర్శించుకున్నారు.

అధికారులు హాజరు కావాలి

రాప్తాడు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అన్ని శాఖల అధికారుల హాజరు కావాలని తహసీల్దార్ విజయ కుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గైర్హాజరైన అధికారులపై చర్యల కోసం కలెక్టర్‌కు నివేదిస్తామని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో కనకదాస జయంతి



భక్త కనకదాసకు పూజలు నిర్వహిస్తున్న కురుబలు

ఆత్మకూరు: కురుబల ఆరాధ్యదైవం భక్త కనకదాస జయంతి వేడుకలను ఆదివారం ఆత్మకూరులో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కనకదాస విగ్రహానికి పూల మాలలు వేసి, పాలాభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గొరవయ్యలకు పాలుపోసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. సాయంత్రం కనకదాస చిత్ర పటంతో గ్రామోత్సవం జరిగింది. జ్యోతులు పడుతూ పూర్ణకలశాలతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. కురుబ సంఘం పెద్దలు మాట్లాడుతూ కనకదాసు తన రచనలతో ప్రపంచాన్ని ప్రభావితం చేశారన్నారు. కురుబలు ఐకమత్యంగా ఉండి అన్ని రంగాల్లో ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బేల్దారి సుబ్బర హనుమంతు, ఎంపీపీ హేమలత, మారెన్న, నీలకంఠ, సిమెంట్ పోతన్న, గొరవ శేఖర్, బిల్లే పెదయ్య, మూడింద్ల ఆదెప్ప, వెంకటేష్, సుబ్బర అంజినప్ప, హరికృష్ణ, ఎబ్బిలి ఎర్రిస్వామి, చిత్రా ఓబుళపతి, పల్లె నారాయణ, అనిల్, సుబ్బర నారాయణప్ప, గొరవ తిక్కస్వామి, నారాయణ, బిల్లే శివయ్య, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాలకు స్వర నీరాజనం



భగవద్గీతను ఆలపిస్తున్న ఆరాధన సమితి బృందం

అనంతపురం కల్చరల్: అమరగాయకుడు ఘంటసాల ఆలపించిన ఆ పాత మధురాలతో గాయకులు శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. అనంత ఘంటసాల ఆరాధన సమితి వ్యవస్థాపకులు, సీనియర్ గాయకులు పాలసముద్రం నాగరాజు ఆధ్వర్యంలో మూడో రోడ్డులోని ఘంటసాల భవన్‌లో ఆదివారం సంగీత సత్సంగం జరిగింది. ఘంటసాల జయంతి వేడుకల సందర్భంగా అధిక సంఖ్యలో విచ్చేసిన గాయకులు ప్రేక్షకులను ఆపాత మధురాలతో ఆకట్టుకున్నారు. జీవీ రామయ్య, ఆచార్య సుధాకరబాబు, శ్రీదేవి, లక్ష్మీనారాయణ, బృంద, పద్మ, యాదాటి రవి, పగడాల లక్ష్మి పాడిన పాటలు అలరించాయి. పాలసముంద్రం నాగరాజు ఆలపించిన ఘంటసాల భగవద్గీత తన్మయులను చేసింది. నిర్వాహకులు మాట్లాడుతూ ఘంటసాల మాస్టరుతో పాటు ఆయన తనయులు రత్న కుమార్, విజయ్‌కుమార్ కూడా డిసెంబరు నెలలోనే జన్మించినందున వారి స్మారక సంగీతోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం శ్రీదేవి నేతృత్వంలో జీవీ రాయయ్యతో పాటు పాలసముద్రం దంపతులను ఘనంగా సత్కరించారు.

రేపు ఎం.బండమీదపల్లిలో రెవెన్యూ సదస్సు

రాప్తాడు: భూ సమస్యలకు పరిష్కారం కోసం మంగళవారం ఎం.బండమీదపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ విజయకుమారి తెలిపారు. మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. బుక్కచెర్ల రెవెన్యూ గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

'అమరజీవి' ఆదర్శప్రాయుడు



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌టీఏ నాయకులు



అమరజీవి వర్ధంతి సందర్భంగా రక్తదానం చేస్తున్న యువత, చిత్రంలో గోపా మచ్చా నరసింహులు

అనంతపురం కల్చరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శప్రాయమని కొత్తూరు అమ్మవారి శాల అధ్యక్షులు గోపా మచ్చానరసింహులు అన్నారు. పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా ఆదివారం టవర్‌క్లాక్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రక్తదాన శిబిరం నిర్వహించి సర్టిఫికెట్లను అందించారు. మహిళా మండలి వారి ఆధ్వర్యంలో బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షులు వెంకటేష్‌బాబు, సంఘం ప్రతినిధులు సూర్యప్రకాష్, నాగభూషణ, మహేష్, సతీష్, కిషోర్, మురళీ, రఘు, యువజన సంఘం వెంకటేష్ గుప్తా, మహిళా సంఘం నిర్మలా దేవి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

• పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయనకు జిల్లా ఆర్యవైశ్య సంఘం సిరిగుప్ప వెంకటేశ్వర్లు, సెక్రటరీ మనోజ్, సత్యరంగయ్య, సత్రసాల మంజునాథ్ తదితరులు ఘనంగా నివాళులర్పించారు.

వైఎస్సార్‌టీఏ ఆధ్వర్యంలో..

అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్‌టీఏ) ఆధ్వర్యంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. నగరంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ దీక్ష చేపట్టి ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్ కుమార్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగిరెడ్డి గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. వెంకటరమణప్ప, నాయకులు గోవిందరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మహేంద్రరెడ్డి, సాయినాథ్ రెడ్డి, తిమ్మారెడ్డి, రామకృష్ణ, రవీంద్రారెడ్డి, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరు: ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఆమరణ దీక్ష చేపట్టి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయుడని ఎంపీపీ సుబ్బర హేమలత కొనియాడారు. ఆదివారం పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీతో పాటు ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఆత్మకూరు ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, సచివాలయ సిబ్బంది శ్రీనివాసులు పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజ

అనంతపురం కల్చరల్: స్వామి శరణం..అయ్యప్ప శరణం అంటూ భక్తుల శరణు ఘోషతో ఆలయ పరిసరాలు ప్రతిధ్వనించాయి. ఆదివారం రాత్రి అయ్యప్ప మహా పడిపూజోత్సవం కనుల పండువగా సాగింది. రామ్‌నగర్‌లోని 80 ఫీట్ రోడ్డు సమీపంలో వెలసిన అయ్యప్ప స్వామి సేవా సంఘం వారి ఆధ్వర్యంలో సాగిన పడిపూజలో వందల సంఖ్యలో అయ్యప్ప మాలధారులు తరలి వచ్చి సామూహిక భజన నిర్వహించారు. 18 మెట్లను సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. భజన బృందాలు రాగయుక్తంగా ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. నిర్వాహకులు మాట్లాడుతూ ఇంటి వద్ద వసతి లేని మాలధారులకు నిత్యం 500 మందికి భోజన వసతిని ఏర్పాటు చేస్తున్నామని, వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం సామూహిక భిక్ష కార్యక్రమం జరిగింది. వివిధ ఆలయాల గురుస్వాములు పడిపూజల్లో పాల్గొన్నారు.

'అమ్మ' సేవలు అభినందనీయం



దివ్యాంగునికి ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు చేతుల మీదుగా పుస్తకాలు అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: అభాగ్యులకు 'అమ్మ' సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని శ్రీసత్యసాయి జిల్లా అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు అన్నారు. ఆదివారం నగరంలోని హెచ్చెల్సీ కాలనీ అనాథ దివ్యాంగుల ఆశ్రమంలో పోటీ పరీక్షలకు ఖరీదైన స్టడీ మెటీరియల్ తెచ్చుకోలేక ఇబ్బంది పడుతున్న 50 మంది దివ్యాంగ విద్యార్థులకు రూ.70 వేలు విలువ చేసే మెటీరియల్‌ను అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమానికి ఏఎస్పీ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్న రమణారెడ్డి దివ్యాంగ విద్యార్థులకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. తరిమెల రమణారెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల అవసరాలను పట్టించుకుని వారిలో ఆత్మస్థైర్యం నింపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భవిష్యత్తులోనూ వారికి అండగా నిలవడానికి తమ సంస్థ సిద్ధంగా ఉందన్నారు.

బిల్లు కావాలంటే బాస్‌ను కలవాల్సిందే!

- సెలవుల్లో పంచాయతీ సెక్రటరీలు
- 17 మందిలో 9 మందే విధుల్లో
- పనులు చేసినా బిల్లులు పెట్టని అధికారులు
- అధికార పార్టీ నేత సిఫార్సు ఉంటే చకచకా ముందుకు..



ఆత్మకూరు: ప్రజలకు, ప్రజాప్రతినిధులకు మధ్య వారధులు ప్రభుత్వ అధికారులు. అయితే ఆత్మకూరు మండలంలో అధికారులు వారి ఉద్యోగ ధర్మాన్ని పక్కన పెట్టి అధికార పార్టీ నేతలకు జీ హుజూర్ అంటున్నారు. వారి సేవలోనే తరిస్తున్నారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు. ప్రజల చేత ఎన్నికైన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు ఏమాత్రమూ గౌరవం ఇవ్వకుండా ప్రొటోకాల్‌ను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి పనులు చేపట్టిన వారికి బిల్లులు పెట్టండని అడిగితే అధికారులు ముప్పుతిప్పలు పెడుతున్నారు. అధికార పార్టీ నేతల ఆదేశాలను అనుసరిస్తూ బిల్లులకు కొర్రీలు వేస్తున్నట్లు తెలిసింది. అప్పులు తెచ్చి పనులు పూర్తి చేయించిన ప్రజాప్రతినిధులు బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే అధికారులు 'మీరు పనులు చేశారా.. ఎప్పుడు..?' అంటూ హేళనగా మాట్లాడుతున్నారని పలువురు సర్పంచులు వాపోతున్నారు. మండలంలో ఓ అధికారి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అటు ప్రజాప్రతినిధులతో పాటు ఇటు పంచాయతీ సెక్రటరీలు కూడా ఆరోపిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏం జరుగుతోందో తెలియక అటు కింద స్థాయి ఉద్యోగులు, ఇటు ప్రజా ప్రతినిధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సగం మంది పంచాయతీ సెక్రటరీలు సెలవులోనే..

గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సర్పంచ్ ఎంత అవసరమో.. పంచాయతీ సెక్రటరీ కూడా అంతే అవసరం. ఏ సమస్య వచ్చినా గ్రామంలో అయితే సర్పంచ్ దృష్టికి, పంచాయతీ కార్యాలయంలో అయితే పంచాయతీ సెక్రటరీకి తెలియజేస్తారు. కానీ మండలంలో మాత్రం 17 పంచాయతీలలో 8 మంది (ఆత్మకూరు, పంపనూరు, సింగంపల్లి, సనప, తోపుదుర్తి, ముట్టాల, వేపచెర్ల దిగువ తండా, బి.యాలేరు) సెక్రటరీలు సెలవులపై వెళ్లారు. మిగిలిన 9 మందిని మిగిలిన పంచాయతీలకు ఇన్‌చార్జ్‌లుగా నియమించి పనులు చేయిస్తున్నారు. ఈ ఎనిమిది మంది సెక్రటరీలు అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల వల్లే సెలవులపై వెళ్లారా? లేదా అధికారులు తమ మాట వినకపోతే సెక్రటరీలను ఒత్తిళ్లకు గురి చేశారా? అన్నది చర్చనీయాంశంగా మారింది.

బిల్లులు ఎప్పుడు పెడతారో?

గ్రామాల్లో సర్పంచులు అప్పులు చేసి మరీ అభివృద్ధి పనులు చేపట్టారు. చాలా పంచాయతీల్లో పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులు రాలేదని పలువురు సర్పంచులు వాపోతున్నారు. బిల్లుల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అధికార పార్టీకి చెందిన 'బాస్'ను కలిసి ఒక్క మాట చెప్పిస్తే బిల్లులు వస్తాయని కార్యాలయ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే తాము పనులు చేసి.. నాయకులతో ఎందుకు ఫోన్ చేయించాలంటూ సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐదు నెలలుగా ఒకరిద్దరికి మినహా మిగిలిన వారికి గౌరవ వేతనాల బిల్లు కూడా పెట్టలేదని వాపోయారు.

వ్యక్తిగత కారణాలతోనే సెలవులు

మండలంలో 8 మంది పంచాయతీ సెక్రటరీలు సెలవు పెట్టడం వాస్తవమే. వీరిలో కొంతమంది గ్రూప్ –2 కోసం సన్నద్ధం, మరి కొంతమంది అనారోగ్య సమస్యలు తదితర వ్యక్తిగత కారణాల వల్ల సెలవులు పెట్టారు. సెవులు పెట్టిన గ్రామాల్లో ఇన్‌చార్జ్‌లుగా మరొక సెక్రటరీకి బాధ్యతలు అప్పగించాం.

– లక్ష్మీనరసింహ, ఎంపీడీఓ

బిల్లులు పెండింగ్ లేవు

సర్పంచ్‌లు చేసిన పనులకు సంబంధించి మా వద్ద ఎలాంటి బిల్లులూ పెండింగ్‌లో లేవు. ప్రస్తుతం వారు చేసిన పనులకు సెక్రటరీలు ఫామ్స్, క్యాష్‌బుక్ ఇలాంటివి రెడీ చేసుకున్న తరువాత బిల్లులు పెడుతాం. అవన్నీ పంచాయతీ సెక్రటరీల దగ్గరే ఉన్నాయి. సెక్రటరీలు బిల్లులు రెడీ చేసుకొని వస్తే బిల్లులు పెడుతాం. ఈ విషయం ఇటీవల సర్పంచ్‌ల శిక్షణలో తెలియజేశాం.

– కామాక్షి, ఈఓఆర్డీ

సందడిగా సపోజ్ క్రిస్మస్

అనంతపురం కల్చరల్: సపోజ్ క్రిస్మస్ వేడుకలు ఆదివారం సందడిగా జరిగాయి. సండే స్కూల్ చిన్నారుల ఆటపాటలు, భక్తిగీతాలాపనలు, లఘు నాటికలు ఆకట్టుకున్నాయి. స్థానిక అరవిందనగర్‌లోని జీసెస్ కంపాషన్ చర్చిలో జరిగిన వేడుకల్లో రెవరెండ్ మోసెస్ అనిల్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. ప్రీ క్రిస్మస్ వేడుకల్లో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భక్తిగీతాలను కోయర్ బృందాలు మధురంగా పాడి ఆకట్టుకున్నారు. అనంతరం ప్రభు సంస్కార భోజనం అందించారు.

నేడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

రాప్తాడు: బొమ్మేపర్తి, లింగనపల్లి, పుల్లరేవు, యర్రగుంట, గొందిరెడ్డిపల్లి, రామినేపల్లి, హంపాపురం, గొల్లపల్లి, మరూరు, ఎం.కృష్ణాపురం, ఎం.చెర్లోపల్లి, పాలవాయి, ఎం.బండమీదపల్లి, పర్వతదేవరపల్లి, ముక్తాపురం గ్రామాల్లోని భారత్ గ్యాస్ వినియోగదారులకు సోమవారం సిలిండర్లు పంపిణీ చేయనున్నారు. ఈ నెల 16 వరకు భారత్, హెచ్‌పీ, ఇండేన్ గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులకు రాప్తాడులోని పాత ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సిలిండర్లను అందజేయనున్నారు.